భజన సమాజాలు - స్త్రీజన కర్తవ్యం

శ్రీమతి కనుపర్తి వరలక్ష్మమ్మ

జాతినిత్యం, మానవజీవితం అనిత్యం గనుక, మన జాత్యభ్యుదయం నిమిత్తం మనవంతు సేవాధర్మం మనం నిర్వర్తించాలె. స్త్రీ విశ్వకుటుంబినియై గృహంతోబాటు దేశసముద్ధరణానికి కూడా తోడ్పడాలి. 18 కోట్ల భారత మహిళామణులు అజ్ఞానతమస్సులో ఉన్నన్నాళ్లు భారతదేశానికి విముక్తి లేదు; కల్యాణం లేదు.

మనదేశంలో స్త్రీ సమాజాలే చాలాతక్కువ. అందులో ప్రార్థనాసమాజాలనబడేవి రెండుమూడు కన్న అధికంగా లేవు. అయితే రత్నంయొక్క విలువ సంఖ్యనుబట్టీ ఉండదు, పరిమాణాన్నిబట్టీ ఉండదు. వాని ప్రాశస్త్యాన్నిబట్టే ఉంటుంది. ప్రార్థన అనగానే అది భగవత్పరమైన సంస్థ అని స్ఫురిస్తుంది. ప్రార్థన మానవుని సర్వవిధాలా పునీతమొనర్చి భగవత్సాహచర్యం గల్గించే దివ్యసాధన. పవిత్రమైన కృష్ణవేణీ జలావగాహనంచేస్తే దేహమాలిన్యమే నివర్తికావచ్చును. ప్రార్థనచేస్తే మనోవాక్కర్మంబులు మూడింటా మానవులు పరిశుద్ధులౌతారు. ఇనుము అయస్కాంతం దెసకు ఆకర్షితమైనట్లు ప్రార్థనాశీలి చిత్తం భగవంతుని దెసకు ఆకర్షితమౌతుంది. ఎవరైతే భగవత్ప్రార్థనను అనుదినవ్రతంగా పెట్టుకొంటారో వారికి భగవత్సాన్నిధ్యం సులభమౌతుంది. ప్రార్థన నటనావినోదం గాదు. వాగాడంబరం గాదు. మనోవిలాసం గాదు. దైహికవాచిక మానసికదోషములనెల్ల వారించి ఏకాగ్రచిత్తం కలుగజేసి పరమాత్మానుసంధానం ప్రాప్తింపజేసేదే ప్రార్థన. ప్రార్థనాశీలికి సర్వవిషయములందును భగవదర్పితబుద్ధి యేర్పడడం, కష్టసుఖాది ద్వంద్వములయందు సాక్షిమాత్రుడుగా ఉండటం, నిష్కామకర్మయోగి కావడం స్వభావమౌతుంది. ప్రార్థనవల్ల యెట్టి ఆధ్యాత్మికబలం యేర్పడేది, యెట్టి మహత్తర కార్యనిర్వహణాశక్తి సమకూడేదీ, ఎట్టి జగద్వశీకరణ సామర్థ్యం కలిగేది, నేడు మహాత్మాగాంధీగారివల్ల మనము తెలుసుకుంటూనే ఉన్నాము. మానావమానముల క్లేశము, జయాపజయముల వేదన, కలిమిలేముల రాపిడి, దూషణభూషణల కలత, తారతమ్యముల వ్యత్యస్తములేక వీనికన్నిటికి అతీతుడై అతడింతటి జగద్వంద్యమగు మానవసేవచేయుటకు ఆయన నిరంతర ప్రార్థనాశీలతయే కారణము. శ్రీ మహాత్మా గాంధీగారు తమ స్వీయచరిత్రలో ప్రార్థననుగురించి యిట్లు వ్రాశారు.

'స్తుతియు, ఉపాసనయు, ప్రార్థనయు, ఇవి గ్రుడ్డినమ్మకములు కావు, అవి పానభోజనస్థాన గమనములకంటె అధిక సత్యములు.' ఇవియు సత్యములు, మిగిలినవి అసత్యములన్నచో అతిశయోక్తి కాజాలదు.

ఈ ఉపాసన, ఈ ప్రార్థన, వాణీవైభవముకాదు. దీనికి కాణాచి నాలుకకాదు, హృదయము. కావున భక్తిని నించి హృదయమును నిర్మలము చేసికొంటిమేని, మనమూ అనంతమున కెగురగలము. ప్రార్థనకు జిహ్వతో

బెజవాడ యువతీ ప్రార్థనా సమాజం 26 వ వార్షికోత్సవ అధ్యక్షోపన్యాసము నుండి కొన్ని ముఖ్యమైన భాగములు.

పనిలేదు. అది స్వభావముచేతనే అద్భుతవస్తువు. వికారరూపములగు మలములను అనగా కామాదులను శుద్ధి చేయుటలో హృదయపూర్వకమైన ఉపాసన ఉత్తమసాధనమని చెప్పుటకు నేను సందేహింపను. అయితే ఆ ఉపాసన అతి వినతితో అతి నమ్రతతో పొంది పొసగియుండవలయును.

ప్రార్థనయందు గల మహత్తరశక్తి మహాత్మునకేగాక ప్రార్థనాశీలురకెల్ల యిటులనే అనుభవగతమైయే యున్నది. ప్రార్థన అంటే భగవంతుని వేడుకొంటూ ముక్కుమూసుకొని కూర్చోవడంగాదు. కరచరణాద్యవయవ సంఘటిత కాయము మనకు భగవంతునిచే ప్రసాదింపబడ్డది, నిర్వ్యాపారతచే జడమొనర్చుడానికి గాదు. ఫలాఫలములయెడ నిర్విచారులై లోకసేవ చేయడమే ప్రార్థనాశీలుర ధర్మం. ఏ మహనీయుని దివ్య సందేశముచే ప్రబోధితమై ఈ ప్రార్థనాసమాజాలేర్పడ్డవో ఆ మహనీయ రాజా రామమోహనరాయలవారి దివ్యజీవితమే యిందుకు తార్కాణం. రాజకీయంగా, సాంఘికంగా, నైతికంగా, ఆధ్యాత్మికంగా ఆయన చేసిన మహత్సేవాఫలితమే మన యీ స్త్రీ సమావేశాదులని చెప్పినను చెప్పవచ్చును. దయార్ద్రహృదయుడగు ఆ మహనీయుడు చేసిన మహత్తరకృషివల్లనేగదా సహగమన దురాచారం మనదేశంలో నిర్మూలమై అసంఖ్య భారత నారీమణులు బలవన్మరణం పాలయ్యే దురదృష్టం తప్పింది. ఈ ప్రాణదాతయొక్క లోకోత్తరమైన సేవతో యేది తుల్యమౌతుంది? సేవలోనే జన్మయొక్క సార్థకత యున్నది. ఉదార బ్రాహ్మమతంయొక్క మూలసూత్రాలైన ఈశ్వరపితృత్వము మానవసౌభ్రాతృత్వము సేవవల్లనే సఫలీకృతం కాగలవు.

ఏప్పెట్టె తాళం తీయవలెనన్నా, తాళపుచెవి కావలసినట్లుగా ఏపనిచేయవలెనన్నా విద్య కావలెను. మానవులకు విద్యయే దివ్యాలంకారము. 'విద్యావిహీనః పశుః' అను భర్తృహరి సుభాషితం సుప్రసిద్ధమే గదా. మానవులకు జీవితవికాసానికి విద్యయే మూలాధారం. అయితే విద్యయొక్క పరమార్థం జ్ఞానాభివృద్ధిగాని ద్రవ్యార్జనగాదు. విద్య ద్రవ్యసంపాదనమాత్ర ప్రయోజనకరమే అని భావించువారు చదువుకున్నవారైనప్పటికీ వారి అవిద్యాతమస్సు విచ్చలేదనే చెప్పాలె. స్త్రీయొక్క జీవితం సేవాప్రధానమైనది. గృహిణీధర్మమంతా భగవత్సేవ, భర్తృసేవ, శిశుసేవ, అత్తమామల సేవ, బంధుసేవ, అతిధి అభ్యాగతిసేవ, వ్యాధిగ్రస్తుల సేవ, ఆదిగాగల సేవలతో నిండియున్నది. ఏ స్త్రీయొక్క విద్యావికాసం గృహిణులకు నిర్దిష్టమైన యీ సేవాధర్మ నిర్వహణానికి సహాయకరమౌతుందో అదియే స్త్రీల కుచితమైన విద్య అని చెప్పవలె. అంతేగాకుండా వర్తమాన భారతదేశ పరిస్థితులనుబట్టి స్త్రీ సేవారంగము యింతకంటె విశాలమొనర్చుకొనవలసియున్నది. ప్రాచీన భారతదేశము స్వతంత్రపరిపాలనా సౌభాగ్య విరాజితమై ఉన్ననాడు భారత స్త్రీ కార్యక్షేత్రము గృహముమాత్రమే అయిఉండెను. గృహసీమదాటి ఆమె అవతలికిపోవలసిన పని కలుగలేదు. నేటి పరిస్థితులు అట్టివి కావు. నేటికాలపు స్త్రీలకు చదువులేదు. ఆర్థికవసతి లేదు. మతసాంఘికహక్కులు లేవు. పైగా దేశము పరదేశీయపరిపాలనా పీడితమై బానిసత్వం అనుభవిస్తున్నది. ఈ సమయములో స్త్రీలు వంటయింటియందే మసుగడ వెళ్లబోస్తూ ఉండినచో ఈ దేశం యెప్పటికీ అభివృద్ధిచెందజాలదు. జాతినిత్యం, మానవ జీవితం అనిత్యం గనుక, మన జాత్యభ్యుదయంనిమిత్తం మనవంతు సేవాధర్మం మనం నిర్వర్తించాలె. స్త్రీ విశ్వకుటింబినియై గృహంతోబాటు దేశసముద్ధరణానికిగూడా తోడ్పడాలె. 18 కోట్ల భారతమహిళామణులు అజ్ఞానతమస్సులో ఉన్నన్నాళ్లు భారతదేశానికి విముక్తిలేదు; కల్యాణంలేదు.

నీతియుతమైన నడవడి లేకపోతే విద్యనేర్చి ప్రయోజనంలేదు. నీతియుతమైన ప్రవర్తనా, స్వార్థవిరహితమైన ప్రేమా యీ రెండే ముక్తిమార్గాలు. యావత్ప్రపంచం చుట్టివచ్చినప్పటికే పొగబండి యినుప

పట్టాలనువీసమైనా యెట్లా అతిక్రమించగో, ఆవిధంగానే మానవులుగూడా యే కార్యక్షేత్రాన పనిచేసినా నీతిధర్మాలను సుంతైనా అతిక్రమించగూడదు. పట్టాతప్పితే రైలు యెట్లా బోల్తాపడిపోతుందో నీతిధర్మాలను అతిక్రమించితే మానవజీవితంగూడా అట్లా బోల్తాపడిపోతుంది.

ఐహికమనీ పారమార్థికమనీ విభజనచేసుకొని ఐహికంలో యెట్లాఉంటేనేమి పారమార్థికంగా నడిపితే చాలుననేది కొందరి పంథా. ఇంట్లో కోడలికి అన్నంపెట్టక, నీళ్లుపోయక రాచిరంపాన పెట్టుతూ పైకి భగవద్గీత చేతులతో పట్టుకొని రుద్రాక్షలపేర్లు పెద్దవిధరించి జపంజేస్తూవుండే అత్తగారూ; యింటివద్ద దేవపూజా పితృతర్పణాలు, బ్రాహ్మణ సమారాధనలూ కోలాహలంగా చేస్తూ కచ్చేరీలో నిర్దాక్షిణ్యంగా లంచాలులాగే ఉద్యోగస్థుడూ; ఉదయం సాయంత్రం దేవాలయానికి నిష్టగాపోయి నమస్కారాలుచేస్తూ బడిలో కాపీచేయటానికి ప్రయత్నించే విద్యార్థీ—ఇటువంటివారంతా యీ పంథాలోనివారే. ఇటువంటివారు బాహ్యానికి యెందుకైనా మంచిదని నమస్కారాలు చెల్లిస్తున్నా భగవంతుని సర్వమయత్వము, సర్వాంతర్యామిత్వము వీరికి బోధపడలేదన్నమాట. ఇందువల్ల ఆత్మవంచనా పరవంచనా గాకుండా దైవవంచనగూడా చేస్తున్నారు. తీర్థానికి తీర్థం ప్రసాదానికి ప్రసాదం అనే నడవడి చాలా అనర్థకమైంది. దీనివల్ల యెప్పటికీ ఆత్మోన్నతిలేదు. నిజానికి పారమార్థిక చింతకంటె ఐహికజీవితంలో నిష్ఠగా నడవటమే కష్టమైనపని. ఫలితంగూడా దీనివల్లనే ఉన్నది. పూర్వం జనకాది మహారాజులేమి, ప్రస్తుతం మహాత్ముడు మొదలైన మహానుభావులేమి ఐహికజీవితంలో జూపిన నిష్ఠాపరత్వంవల్లనే కీర్తిశోభితులైనారు.

ప్రస్తుతం మనదేశంలో ముఖ్యంగా మన స్త్రీ సముదాయంలో పారమార్థిక చింత అనేది కపటంతోను దంబంతోను కూడుకున్నదిగా ఉంటున్నది. పుణ్యాపేక్షచేతనే స్త్రీలీ మాయావాగురులలో జిక్కుకుంటున్నారు. భ్రష్టలౌతున్నారు. గురుశుశ్రూషలు శృంగారరసప్రకరణాలుగాను, భజనతంతులు విలాసక్రీడలుగాను పరిణమిస్తున్నాయి. ఏమితప్పులుచేసినా భగవంతుణ్ణి స్మరిస్తూవుంటే చాలునను దురభిప్రాయం స్త్రీలను తప్పుత్రోవ పట్టిస్తున్నది. ఏ భగవద్గీతాది వేదాంతగ్రంథాలనుజూపి నేడు గురువులు స్త్రీలను వంచిస్తున్నారో, ఆ గ్రంథములలో భక్తిజ్ఞానవైరాగ్య లక్షణాలు అతినీతిబద్ధమైనవిగా చెప్పబడియున్నవి గాని, నటనలతో కాలక్షేపంచేయడమే మంచిపద్ధతని చెప్పలేదు. స్త్రీలావిషయాలను చక్కగా తెలుసుకోకుండ యీ మాయాకలాపంతో మోహితులవడం ఉచితంకాదు.

మన స్త్రీ సంఘం బాగుపడలెనంటే యీ దొంగగురువుల దాడినుండి తప్పుకోవాలె. మహాత్ములమీద భ్రాంతులు పోగొట్టుకోవాలె. ఒకవేళ యే గురువువద్దనైనా నైవేద్యంపెట్టిన పాలువెన్నలు సగానికి సగం తగ్గింపజేసే సత్తా, మట్టిని కుంకుమజేసే సత్తా, ఒళ్లుదులిపితే విభూతిరాల్చే సత్తా, భూమిపైనుండి మూడడుగులు లేచే సత్తా, అరచేతిలో హారతీకర్పూరం వెలిగించే సత్తా ఉన్నప్పటికీ అవి ఒక గారడీవాని ఇంద్రజాలమహిమకంటె యెక్కువదికాదని తెలుసుకోవాలె. భక్తిపేరా, భగవంతునిపేరా మన అమాయక స్త్రీ సంఘంపై కాషాయవస్త్రాలు, బవిరిగడ్డాలు, విభూతిరేఖలు, రుద్రాక్షపేర్లు, నామసప్తాహాలు చేస్తున్న అత్యాచార ప్రక్రియలను వివేకయుతులైన స్త్రీలు యెదుర్కోవాలె. మనకు నూరు ధర్మోపదేశాలుచేసి, తనకు వ్రేళ్ల ఉంగరాలు, తనభార్యకు కంఠహారములు అర్థించే గురువు యేమాత్రపు వేదాంతో విచారించాలె. స్త్రీలు గురువు యొక్క నైతికనిష్ఠను తెలుసుకోకుండా వానిమాటలచే వంచితులు కాకూడదు. మోక్షం ఆడంబరాలలో లేదు; ముమ్మాటికీ లేదు.

అనేకవిధాలుగా శిథిలమై పునర్నిర్మాణం కోరుతున్న మన భారతదేశానికి మన స్త్రీలు తోడ్పడుతుంటేనేగాని సఫలంకాదు. నిర్వ్యాపారంగా ఉండటంగాని స్వార్థలాభంతో తృప్తిపొందడంగాని ఉత్తమ మానవలక్షణం గాదు. మతంలో స్త్రీకి తావులేదు. సాంఘికాల్లో స్త్రీ శృంఖలాబద్ధ. ఆర్థికంగా స్త్రీ నిరుపేద. సారస్వతంగా స్త్రీకి అధమస్థానం. కళాపరిశ్రమల్లో స్త్రీ యేనాడో వెనుకబడిపోయింది. ఇన్నివిధాలుగా స్త్రీ తనను స్థానం సంపాదించుకోవలెనంటే అన్నివిధాల అఖండకృషి చేయాలె. స్త్రీ లోకంలో అఖండ ప్రబోధం కలిగించాలె. పూజ్యమైన తన జన్మహక్కైన మాతృస్థానాన్ని అన్నిటికీ మాతృక చేసుకోవాలె. ఇదే ప్రస్తుత స్త్రీల కర్తవ్యం.

• ఆంధ్రీ •

శ్రీకళాకలితమై   అలరారియున్న పూ
లోకవిఖ్యాతమై   ర్వాంధ్ర సౌభాగ్యమ్ము
పునరుద్ధరింపగాఁ బూనుమమ్మా!
నీదు
మనమునను దలపోయ మఱువకమ్మా!!

రుద్రమ్మ నాటియా   మంగమ్మ నాటియా
భద్రపరిపాలనము   సంగరప్రజ్ఞయును
ఖ్యాతికిం దెచ్చుకొన సాగుమమ్మా!
ఆంధ్ర
దీప్తికాంతివ్యాప్తి తెల్పుమమ్మా!!

అబలత్వమునుమాని   అస్వతంత్రతబోవి
సబలత్వమునుబూని   ఆంధ్రత్వమును నిల్ప
ధీరపౌరుషములం దేరికొనుమా!
ఆంధ్రి!
వీరనారీమణివి వేగఁగమ్మా!!

—శ్రీ ఎ. మీనాక్షి.